క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: మేడిపల్లి,భీమారం మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేసే ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. వచ్చే రోజుల్లో ఆరు గ్యారంటీలను హామీలను ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి విప్ పరామర్శ



ఎర్రన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న విప్

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని రాజలింగంపేట గ్రామశాఖ అధ్యక్షుడు గుగ్గిళ్ల గంగారాం తండ్రి ఎర్రన్న అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మరణించగా, బాధిత కుటుంబాన్ని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆదిశ్రీనివాస్ పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, రమేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, బద్దం రాజేందర్ రెడ్డి, మార్గం నర్సారెడ్డి, గంగరాజం, నీరటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు కృష్ణారావు పరామర్శ



ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న కృష్ణారావు

కోరుట్ల: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యంను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శనివారం ఆయన నివాసంలో పరామర్శించారు.ఎమ్మెల్యే సత్యం భార్య మృతి చెందటం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'నో బ్యాగ్' డే



విజేతలకు బహుమతులు అందిస్తున్న టీచర్లు

కథలాపూర్: మండలంలోని కథలాపూర్, భూషణరావుపేట, తాండ్ర్యాల, సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం 'నో బ్యాగ్' డే నిర్వహించారు. విద్యార్థులు పుస్తకాలు, బ్యాగులు లేకుండా పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు నోటిఫికేషన్ విడుదల

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ 2025 ఉచిత శిక్షణలో భాగంగా 2024–25 సంవత్సరానికి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లాలోని ఏదైనా డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూ అభ్యర్థులు జులై 10వ తేదీలోపు వెబ్‌సైట్ www.tgstudycircle.co.inలో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో 10 నెలల శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వినియోగించుకోవాలని, మిగతా వివరాలకు 99592 64770 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ

మెట్‌పల్లి: పట్టణంలోని బంటుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నేల కూలింది. సుమారు పదిహేనేళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రహరీ శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నేలమట్టమైంది. శనివారం ఉదయం హెచ్‌ఎం నారాయణ ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలుపగా, వారు సిబ్బంది చేత ప్రహరీ రాళ్లను తొలగించారు.

బడిని బతికించారు..

- గతేడాది 6 గురు విద్యార్థులు
- మూతపడే దిశగా పాఠశాల
- ఈ ఏడాది 26 కు చేరిన విద్యార్థుల సంఖ్య



కొత్తపేట పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సారంగాపూర్: గత విద్యాసంవత్సరం ఆ పాఠశాలలో విద్యార్థులు కేవలం ఆరుగురే.. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన రోజు గతేడాది చదివిన విద్యార్థులు మరో పాఠశాలకు వెళ్లారు. దీంతో ఈ విద్యాసంవత్సరం పాఠశాల తెరచుకోలేదు. పాఠశాల మూతబడింది. ఈ పరిస్థితి మండలంలోని కొత్తపేట పాఠశాలది. జూన్ 12 న పాఠశాలకు ఒక్క విద్యార్థి రాకపోవడంతో ఉపాధ్యాయులు నేరుగా గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులతో చర్చించారు.దీనిపై పాఠశాల మూతబడితే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వస్తాయోనని గ్రామస్తులకు పాఠశాల ఉపాధ్యాయులు వివరించారు.

పాఠశాలలో సౌకర్యాలపై అవగాహన

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, మధ్యాహ్నభోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అన్ని వివరించారు. బడి మూతపడితే భవిష్యత్తులో మరో పాఠశాల ఇక్కడ తెరవడానికి ప్రభుత్వం ఒప్పుకోదని వివరించారు. దీంతో ఆలోచనలో పడ్డ యువకులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామస్తులకు సమస్య తీవ్రతను గుర్తు చేశారు. దీంతో విద్యార్థుల తల్లితండ్రులతో గ్రామస్తులు మాట్లాడి గ్రామంలోని 26 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులు స్వప్న, ప్రవీణ్ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

చింతల చెరువు కాలువ కోసం సర్వే



కాల్వ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సారంగాపూర్: సారంగాపూర్ శివారులోని చింతల చెరువులోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసే కాలువపై శనివారం ఇంజనీరింగ్ అధికారులు మరోసారి సర్వే నిర్వహించారు. డీ–53 ప్రధాన కాల్వ నుంచి పెంబట్ల–లక్ష్మీదేవిపల్లి శివారుల నుంచి చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని తరలించేందుకు ఇప్పటికే అధికారులు మూడుసార్లు సర్వే పూర్తి చేశారు. కాగా తుది నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు మరోసారి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకవచ్చే విషయంపై సర్వే చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ చక్రునాయక్ తెలిపారు. కాగా సారంగాపూర్ పడమటి వైపు ఉన్న 300 ఎకరాల పంట పొలాలకు సైతం నీరు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఈని రైతులు కోరారు. డీఈ వెంట ఏఈ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

మల్యాల: లంబాడిపల్లి నుంచి దొమలకుంట వెళ్లే దారిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన గ్రామస్తులు శనివారం తహసీల్దార్ మునీందర్‌కు వినతపత్రం సమర్పించారు. లంబాడిపల్లి నుంచి దొమలకుంట వెళ్లే దారిలో ఐకేపీ కొనుగోలు కేంద్రం సమీపంలో దొమలకుంట గ్రామానికి చెందిన వ్యక్తులు దారిని జేసీబీ సాయంతో తవ్వి, కబ్జా చేసి బస్సు వెళ్లేదారిని పక్కకు జరిపారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వే చేపట్టి, హద్దులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ సత్య ప్రసాద్ దృష్టికి సైతం తీసుకెళ్లగా, సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రెండు గ్రామాల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

పెగడపల్లి: మండలంలోని నంచర్లలో రామాలయం సమీపంలోని ఎస్సారెస్పీ భూమి అక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయ సమీపంలోని భూమిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమించాడని, ఆ స్థలాన్ని సర్వే చేయించి ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

బుగ్గారం–వెల్గొండకు రోడ్డు నిర్మించాలి



కుమ్మరి సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న విప్

బుగ్గారం: మండల కేంద్రం నుంచి వెల్గొండ వరకు నూతనంగా రోడ్డును నిర్మించాలని కోరుతూ బుగ్గారం మండల కుమ్మరి సంఘ సభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.ఈ మేరకు శనివారం ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి స్థానిక సమస్యల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం అడ్లూరి స్పందిస్తూ రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుమ్మరి సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన విలాసాగరపు సురేశ్‌ను విప్ సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నర్సాగౌడ్, కొడిమ్యాల రాజన్న, సురేశ్, మహేశ్, కేలేటి మోహన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్లటౌన్: పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని కాల్వగడ్డ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కోరుట్ల యంగ్ మెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. జువ్వాడి నర్సింగరావు, నిర్వాహక కార్యదర్శి శికారి రామకృష్ణతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలంలో అందరూ మొక్కలు నాటాలన్నారు. ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటి, సంరక్షించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. ఎం. భూమయ్య, నాయకులు తిరుమల గంగాధర్‌గౌడ్, ఎంబేరి నాగభూషణం, పుప్పాల ప్రభాకర్, గడ్డం వెంకటేశ్ గౌడ్, ఆడెపు మధు, మచ్చ కవిత, రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఒకరు మృతి



విజయ్

మేడిపల్లి: భీమారం మండల కేంద్రానికి చెందిన ద్యావనపెల్లి విజయ్ శనివారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందాడు. సామాజిక కార్యకర్త అయిన విజయ్ హఠాత్తుగా మృతి చెందడం విషాదం నింపింది. బాధిత కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడారు.

వైజాగ్‌లో దోనూర్ వాసి ఆత్మహత్య



ధనుంజయ్

ధర్మపురి: స్నేహితుడి పెళ్లి కని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్ వెళ్లిన ఓ యువకుడు అక్కడి ల్యాడ్జిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం దోనూర్ గ్రామానికి చెందిన మామిడి ధనుంజయ్ (22) పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 18న వైజాగ్‌లో తన స్నేహితుడి పెళ్లి ఉండడంతో అక్కడకు వెళ్లాడు. ఇంతలో ఏమైందో తెలియదుగానీ లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో వారు వైజాగ్ వెళ్లారు. ధనుంజయ్ ఆత్మహత్య ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ధనుంజయ్ తల్లి అంగన్‌వాడీ టీచర్. తండ్రి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్.

బ్యాంక్ ఖాతా నుంచి రూ.23 వేలు మాయం

జగిత్యాలక్రైం: సైబర్ నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త రకం విధానాన్ని ఎంచుకుని మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లాకేంద్రంలోని ధరూర్ క్యాంప్‌నకు చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి తోడేటి గంగాధర్ ఈనెల 20న తన సెల్‌ఫోన్‌లోని సిమ్ చెడిపోవడంతో కొత్త సిమ్ తీసుకున్నాడు. ఫోన్లో వేసుకున్న రెండు గంటల తర్వాత సిమ్ అందుబాటులోకి వచ్చింది. అంతలోనే సైబర్ నేరగాళ్లు ఆయన ఎస్‌బీఐ ఖాతా నుంచి నాలుగు దఫాలుగా రూ.23 వేలు కాజేశారు. వెంటనే అప్రమత్తమైన గంగాధర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బండి సంజయ్‌ను కలిసిన నాయకులు



బండి సంజయ్‌తో నాయకులు

జగిత్యాలటౌన్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి, ఏసీఎస్ రాజు, నల్ల రవి, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, అంకారి సుధాకర్, సంపూర్ణచారి, సిరిసిల్ల వేణు, బిట్టు పాల్గొన్నారు.

భీమారం మండల నాయకులు..

మేడిపల్లి: భీమారం మండల బీజేపీ నాయకులు, కరీంనగర్ ఎంపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ని కరీంనగర్ వారి కార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండోసారి గెలిచి మంత్రిగా అయినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీమారం యాదవ సంఘం అధ్యక్షుడు రెబ్బాస్ మల్లయ్య, కమ్మరిపేట అధ్యక్షుడు కోటగిరి లింగంగౌడ్, గంగారాం, లింగారెడ్డి, చుక్క రంజిత్, బండపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'చెరువుల ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలి'

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు,కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. వెల్లుల,జగ్గాసాగర్, మెట్లచిట్టాపూర్, రామలచ్చక్కపేట, ఆత్మనగర్ గ్రామాల్లో చెరువులు,కుంటలను కొందరు ఆక్రమించారని ఆరోపించారు.ఆక్రమణలపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ,ఎస్సారెస్పీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు.ఎంతో మంది గంగపుత్రులు చెరువులను కాపాడుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని,అలాంటి చెరువులు,కుంటలు ఆక్రమణలకు గురికావడం బాధాకరమన్నారు.అధికారులు వెంటనే స్పందించి సర్వే చేయాలని లేనిపక్షంలో తహసీల్దార్, ఎస్సారెస్పీ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు.

భక్తుల కోసం రహదారి ఏర్పాటు

కోరుట్ల: పట్టణ శివారులోని పెద్దవాగు ఒడ్డున గ్రామ దేవతల ఆలయాలకు భక్తులు వెళ్లేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో వాగులో శనివారం రహదారిని ఏర్పాటు చేశారు. ప్రతీ ఏటా వర్షా కాలం ఆషాఢమాసంలో భక్తులు వాగు అవతలి వైపున ఉన్న మహాలక్ష్మీ, మడేలయ్య, పోచమ్మ ఆలయాలకు భక్తులు బోనం మొక్కులు చెల్లించేందుకు వెళ్తుంటారు. కాగా రహదారి కోతకు గురి కావటంతో భక్తులు జాతీయ రహదారి నుంచి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో వాగులో దారిని పునరుద్ధరించారు. దారి పనులను కమిషనర్ బట్టు తిరుపతి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించినందుకు కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని భరతమాత కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. మాజీ సర్పంచులు నల్ల బాపురెడ్డి, గజ్జి గంగారెడ్డి, ఎండీ.జమాల్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిట్టపెల్లి జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బోనాలు



కథలాపూర్: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో కథలాపూర్‌లో శనివారం గంగమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనంతోపాటు వలను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు. గంగమ్మతల్లికి జలాభిషేకం చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని కోరుకున్నామని సంఘం సభ్యులు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: బీఆర్‌ఎస్ కార్యకర్త ప్రతి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన అంకతి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బీఆర్‌ఎస్ పార్టీనుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వం కలిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి,వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ

ధర్మపురి: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, మంచిర్యాల వాసవీ క్లబ్, ఇతర దాతల సహకారంతో శనివారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో అడ్మిషన్లను ప్రోత్సహించడానికి పేద విద్యార్థుల సాయం కింద సుమారు రూ.50 వేల విలువ గల విద్యా సామగ్రిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తామని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. మండలంలోని మొగిలిపేట, పాతదాంరాజుపల్లి గ్రామాల్లో శనివారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి కూన గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సుజిత్‌రావు

మెట్‌పల్లి: ఎస్పీ అశోక్‌ను శనివారం పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు వాకిట సత్యంరెడ్డి, అందె మారుతి, కూన గోవర్ధన్ ఉన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో వైద్యశిబిరం కరపత్రాలను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, ఎలక్ట్ ప్రెసిడెంట్ తోట రాజారాంలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ సిల్వర్ జూబ్లీ వేడుకలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం తరపున భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన కార్యదర్శి ఎలుగందుల సత్యనారాయణను ఆలయ చైర్మన్ సతీష్‌కుమార్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నంబి వేణుగోపాలచార్య కౌశిక,పండితులు బ్రహ్మశ్రీ సభాపతి తిగుళ్ల విషుశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు వేణయ్య, సంజయ్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి సీఐగా నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి: మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్టీ జోన్–1 ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న నిరంజన్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన మెట్‌పల్లి ఏఎస్సైగా పని చేశారు. అలాగే కథలాపూర్, గొల్లపల్లిలతో పాటు ఎస్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహించారు.

డీపీఆర్వో బాధ్యతలు స్వీకరణ

జగిత్యాల: జగిత్యాల డీపీఆర్వోగా లక్ష్మణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల డీపీఆర్వోగా పనిచేసిన భీంకుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇతనిని నియమిస్తూ సమాచార పౌరసమాచారాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

24న మండల సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు మండలపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి శనివారం తెలిపారు.సమావేశానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరవుతారని ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, అధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

25న మండల స్థాయి క్రీడాపోటీలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో ఈ నెల 25న మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో భీమయ్య శనివారం తెలిపారు. క్రీడా పాఠశాల (స్పోర్ట్స్ స్కూల్)లో 4వ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలు, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో మండల విద్యా వనరుల కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పీఈటీ విక్రమ్(9493606514)ను సంప్రదించాలని సూచించారు.

వివాదాస్పద భూమి వద్ద పోలీసుల బందోబస్తు

కథలాపూర్: మండలకేంద్రంలో సర్వే నెంబర్ 163లో ప్రభుత్వ భూమి కేటాయింపు విషయంలో ఇరువర్గాల మధ్య కొన్నిరోజులుగా వివాదం నెలకొనగా, శనివారం ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్, కోరుట్ల, మేడిపెల్లి ఎస్సైలు నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్యామ్‌రాజ్ తమ సిబ్బందితో కలిసి ఉదయం నుంచి రాత్రివరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరువర్గాల వారు వివాదస్పద భూమిలోకి రాకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఐదు వాహనాల పట్టివేత

మేడిపల్లి: మండల కేంద్రంలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సరైన పత్రాలు లేని, నంబరు ప్లేట్‌లేని ఐదు వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శ్యాంరాజు తెలిపారు. నిబంధనలకు ఉల్లంఘించొద్దని ఎస్సై సూచించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కోరుట్ల: పట్టణంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ గృహంపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులతోపాటు ఇద్దరు విటులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరాలపై..

మేడిపల్లి: భీమారం మండలకేంద్రం శివారు ప్రాంతంలో పేకాట స్థావరాలపై దాడులు జరిపి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మేడిపల్లి ఎస్సై శ్యాంరాజు తెలిపారు. వారి నుంచి రూ.4.50లక్షలు, ఒక బైక్, ఒక కారు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మల్యాల: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకుని, బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మల్యాల మండలం తక్కళ్లపల్లి శివారు నుంచి శనివారం రాత్రి రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేసి, ఆటో పట్టుకున్నారు. అందులో 13 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న గుంజపడుగుకు చెందిన గంధం చందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు, పంది మృతి

మల్లాపూర్: మండల కేంద్రంలో శనివారం విద్యుత్ ఘాతంతో రెండు గేదెలు, ఒక పంది మృతి చెందింది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రొడ్డ నర్సయ్య, వేములవాడ చంద్రయ్యకు చెందిన గేదెలను మంద నిలిపే ప్రదేశానికి పంపించారు. కాగా నెల క్రితం ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెడిపడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు వాటిని తొలగించకపోవడంతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఆ తీగలకు కరెంట్ సరఫరా కావడంతో గేదెలు తీగలు తగిలి, మూడు గేదెలకు విద్యుత్ షాక్ రాగా, రెండు అక్కడిక్కడే మృతి చెందగా, మరో గేదె తీవ్రంగా గాయపడింది. అధికారుల నిర్లక్ష్యంతోనే గేదెలు మృతి చెందాయని ఎంపీటీసీ ఆకుతోట రాజేష్, మొరపు గంగరాజం, బాధితులు, గ్రామస్తులువిద్యుత్‌శాఖ కార్యాలయానికి తరలివెళ్లి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్‌కుమార్, గ్రామస్తులతో మాట్లాడి బాధితులతో ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డికి వినతిపత్రం ఇప్పించారు. కాగా మల్లాపూర్‌లోనే కరెంట్ తీగలకు తగిలి శివరాత్రి(మందుల) భూమయ్యకి చెందిన పంది మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ పరంగా బాధితులను ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు.